



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 23-02-2024 సంపుటి : 06 సంచిక : 165 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఛలో రాజధాని..

## ఉద్రిక్తంగా మారిన బెజవాడ

విజయవాడ, ఫిబ్రవరి 22 ఏపీ ప్రభుత్వం దగా డీఎస్సీ కాదు మెగా డీఎస్సీ ప్రకటించాలన్న డిమాండ్ తో కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'ఛలో సెక్రటేరియట్' నిరసన గురువారం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను గృహ నిర్బంధం చేశారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్ లో షర్మిల ఉన్న చోటకు గురువారం ఉదయం చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆమెను ఆ భవన్ లోనే నిర్బంధించారు. ఆమె బయటకు రాకుండా భారీగా మోహరించారు. దీంతో పార్టీ అభిమానుల నినాదాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ నేతలు మస్తాన్ వలి, తులసిరెడ్డి, రుద్దరాజులను పోలీసులు అరెస్ట్ చేశారుపోలీసుల వైఖరిని నిరసిస్తూ షర్మిల సహా పలువురు నేతలు ఆంధ్ర రత్న కార్యాలయం వెలుపల ఆందోళనకు దిగారు. షర్మిల అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా.. పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. 'వైసీపీ నియంత పాలనలో మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా నిలబడితే అరెస్ట్ చేస్తున్నారు. 23 వేల పోస్టుల భర్తీ అని చెప్పి.. కేవలం 6 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చారు.' అని షర్మిల తీవ్రంగా మండిపడ్డారు.కాంగ్రెస్ నేతల గృహ నిర్బంధం, అరెస్టులపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వేలాదిగా వస్తున్న పార్టీ శ్రేణులను ఎందుకు ఆపుతున్నారు.? పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పార్టీ కార్యాలయంలోనే గడపాలా.? నాకు ఈ పరిస్థితి రావడం మీకు అవమానం కాదా.? మేము తీవ్ర వాదులమా.? సంఘ విద్రోహ శక్తులమా.? మమ్మల్ని ఆపాలని చూస్తున్నారంటే మీరు భయపడుతున్నట్లే. మీ అసమర్థతను కప్పి పుచ్చాలని చూస్తున్నారు. ఎన్ని ఆటంకాలు కలిగించిన నిరుద్యోగుల పక్షాన పోరాటం ఆగదు.' అని ఆమె ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.'ఛలో సెక్రటేరియట్' లో పాల్గొనేందుకు షర్మిల బుధవారం సాయంత్రమే విజయవాడ చేరుకుని పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్ లోనే బస చేశారు. అయితే, ఆమె బాపులపాడు మండలం అంపాపురంలోని కేవీపీ రామచంద్రరావు నివాసంలో బస చేయాల్సి ఉండగా.. ముందస్తు అరెస్టుల నేపథ్యంలో ఆమె ఆంధ్ర రత్న భవన్ లోనే ఉండిపోయారు. రాత్రి నుంచి పోలీసుల దమన కాండ కొనసాగుతోందని.. అక్రమంగా కేసులు పెడతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత గిడుగు రుద్రరాజు మండిపడ్డారు. పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఛలో సచివాలయం నిర్వహించిన తీరుతామని.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనే షర్మిల దీక్ష చేస్తారని స్పష్టం చేశారు.

# నిర్బంధం మధ్యే జర్నలిస్టుల చలో అనంత ర్యాలీ

**జర్నలిస్టులపై ఉద్దేశ్యపూర్వక దాడులు సహించం**

**పత్రికా స్వేచ్ఛకోసం ఎందాకైనా పోరాడుతాం**

**జర్నలిస్ట్ సంఘాల నేతల స్పష్టీకరణ**

అనంతపురం,ఫిబ్రవరి22 ): ఫోటో జర్నలిస్ట్పై దాడికి నిరసనగా గురువారం ఛలో అనంతకు ఎపియుడబ్ల్యుజె పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అణచివేత చర్యలు చేపట్టారు. ఎక్కడికక్కడ జర్నలిస్టులను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినప్పటికీ నిర్బంధాల మధ్యనే జర్నలిస్టులు ర్యాలీని చేపట్టారు. సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టులు శాంతి ర్యాలీ నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులు రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయితే జర్నలిస్టులకు మేలు జరుగుతుందని తాము భావించామని కానీ మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దేవాలయాలపై వార్తలు రాస్తున్నారంటూ జర్నలిస్టులపై కేసులు బనాయించారన్నారు. నాడు -నేడు పనులు పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులపై వార్తలు రాస్తే కేసులు పెట్టారన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జర్నలిస్టులపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. మీడియాను కంట్రోల్ చేసే వ్యూహంలో అమరావతి నుంచి బ్యాగులు పంపిస్తున్నారని ఆరోపించారు. భయభ్రాంతులకు గురి చేయడం కోసం దాడులకు పాల్పడుతున్నాం న్నారు. ఆంధ్రప్రదేశ్లో మీడియాపై జరుగుతున్న దాడులపై దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సాక్షి పత్రిక ఛానల్లోని జర్నలిస్టులకు కూడా స్వేచ్ఛ లేదని, జగన్ ఫోటో, వీడియో బాగా రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని విమర్శలు గుప్పించారు. రిపోర్టర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి వ్యతిరేకంగా ప్రజా మద్దతును చూశామన్నారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతోనే జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. 'సిద్ధం' పేరుతో పత్రికలను తిట్టడంతోనే జర్నలిస్టులపై దాడులు చేశారన్నారు. మానవత్వం లేకుండా

# ఖరీఫ్ పంట రుణాలను రీ షెడ్యూల్ చేయండి

## జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-వ్యవసాయం, పాడి, పరిశ్రమ ఇతర ఉపాధి రంగాలపై ఆధారపడి జీవిస్తూ... అర్హులైన వారందరికీ రుణాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు పెద్ద ఎత్తున రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు బ్యాంకర్లను సూచించారు.గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ కె. నరసింహారావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డిఓ నాగ ప్రవీణ్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ టీవీ రమణ, ఎస్బిఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ, పాడి పరిశ్రమ ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో సి.సి కార్డులు మంజూరు చేసిన 22,740 మంది కౌలు రైతులకు విరివిరిగా రుణాలు అందించాలని బ్యాంకర్లను సూచించారు. కరువు మండలాలుగా ప్రకటించిన పాణ్యం, బనగానపల్లి, గడివేముల, మిడుతూరు, పగిడ్యాల, బేతంచర్ల మండలాల్లో ఖరీఫ్ లో తీసుకున్న పంట రుణాలను రిజర్వ్ బ్యాంక్ నిబంధనల మేరకు రీ షెడ్యూల్



చేయాలని కలెక్టర్ బ్యాంకర్లను సూచించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులతో పాటు పాడి పరిశ్రమ, ఇతర అన్ని ప్రాధాన్యతా రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు అందించి ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలని బ్యాంకర్లను, అధికారులను ఆశించారు. జగనన్న బడుగు వికాసం కింద చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల యూనిట్లకు రుణాలందించి యువ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఉపాధి కల్పనకు తోడ్పాటును అందించాలన్నారు. పీఎంఈజీపి, హౌసింగ్, స్టాండ్ ఆఫ్ ఇండియా, ముద్ర స్కీము రుణాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అర్హులయిన వారందరికీ రుణాలను అందించడంలో బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**అందుకే చెరకు మద్దతు ధరలను పెంచాం**

**రైతుల ఆందోళనపై తొలిసారి ప్రధాని మోడీ స్పందన**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి22 : రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో ఆయన తొలిసారిగా స్పందించారు. కేంద్రం చెరకు పంటకు గిట్టుబాటు ధరను పెంచిన నేపథ్యంలో గురువారం ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా స్పందించారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు సంబంధించి ప్రతి డిమాండ్ను నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ నేపథ్యంలోనే చరిత్రాత్మక నిర్ణయం వెలువడింది. చెరకు కొనుగోలు ధర పెంపునకు ఆమోదం లభించింది. దీంతో కోట్లాది మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందని మోదీ పోస్టు చేశారు. బుధవారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ చెరకు గిట్టుబాటు ధరను పెంచింది. గతంతో పోలిస్తే క్వింటాల్కు రూ.25 పెంచింది.దీంతో మద్దతు ధర రూ.340కు చేరింది. 2023-24తో పోలిస్తే ఇది 8శాతం అధికం. ఈ సవరించిన ధర 2024 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం సహా పలు డిమాండ్లతో 'దిల్లీ చలో' ఆందోళనను తలపెట్టిన అన్నదాతలు ఈ నెల 13 నుంచి పంజాబ్-హరియాణా రాష్ట్రాల సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీల వద్ద వేల సంఖ్యలో గుమిగూడి ఉన్న సంగతి తెలిసిందే. వారు దిల్లీ దిశగా తమ నిరసనను ఉధృతం చేసేందుకు యత్నించారు. ఇప్పటికే నాలుగు దఫాలుగా కేంద్రం, రైతుల సంఘాల మధ్య చర్చలు జరిగినప్పటికీ పురోగతి కన్పించలేదు. ఐదో రౌండ్ చర్చలకు రైతు నేతలను కేంద్రం ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర నిర్ణయం వెలువడింది. ఇదిలావుంటే రైతుల ఆందోళనలకు చర్చలు ఒక్కటే పరిష్కారమని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్ అన్నారు. వారు ఈ దేశానికి అన్నదాతలని.. వారితో చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని స్పష్టం చేశారు. యూపీఏ పాలనతో పోలిస్తే.. మోదీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే రైతులకు ఎక్కువ మొత్తంలో నిధులను కేటాయించామని చెప్పారు. కేంద్ర కేబినెట్ బుధవారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైంది. అనంతరం అనురాగ్ ఠాకుర్ మీడియాతో ఈ వ్యాఖ్యలు చేశారు.

# చలో సెక్రటేరియట్ పిలుపు

**ఎక్కడిక్కడే నేతల గృహనిర్బంధం చేసిన పోలీసులు**

**పోలీసుల తీరుకు నిరసనగా ఆంధ్రరత్న భవన్లో షర్మిల దీక్ష**

**మెగా డిఎస్సీ బదులు దగా డిఎస్సీ అంటూ మండిపాటు**

**జగన్ పాలనా తీరుపై షర్మిల ఘాటు విమర్శలు**



విజయవాడ,ఫిబ్రవరి22( కాంగ్రెస్ పార్టీ పిలుపుతో చేపట్టిన చలో సెక్రటేరియట్ ఉద్రిక్తంగా మారింది. పోలీసుల నిర్బంధం కారణంగా పిసిసి చీఫ్ ఆంధ్రరత్న భవన్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. జగన్ ప్రభుత్వ దమనకాండను ఘాటుగా విమర్శించారు. ఏపీ ప్రభుత్వం దగా డీఎస్సీ కాదు మెగా డీఎస్సీ ప్రకటించాలన్న డిమాండ్ తో కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'ఛలో సెక్రటేరియట్' నిరసన గురువారం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను గృహ నిర్బంధం చేశారు. విజయవాడ ఆంధ్ర రత్న భవన్ లో షర్మిల ఉన్న చోటకు ఉదయం చేరుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆమెను ఆ భవన్ లోనే నిర్బంధించారు. ఆమె బయటకు రాకుండా భారీగా మోహరించారు. దీంతో పార్టీ అభిమానుల నినాదాలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటికే కాంగ్రెస్ నేతలు మస్తాన్ వలి, తులసిరెడ్డి, రుద్దరాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ షర్మిల సహా పలువురు నేతలు ఆంధ్ర రత్న కార్యాలయం వెలుపల ఆందోళనకు దిగారు. షర్మిల అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా.. పోలీసులు, కాంగ్రెస్ నేతల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. 'వైసీపీ నియంత పాలనలో మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా నిలబడితే అరెస్ట్ చేస్తున్నారు. 23 వేల పోస్టుల భర్తీ అని చెప్పి.. కేవలం 6 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చారని షర్మిల తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల గృహ నిర్బంధం, అరెస్టులపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వేలాదిగా వస్తున్న పార్టీ శ్రేణులను ఎందుకు ఆపుతున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పార్టీ కార్యాలయంలోనే గడపాలా. నాకు ఈ పరిస్థితి రావడం మీకు అవమానం కాదా. అని ప్రశ్నించారు. మేము తీవ్ర వాదులమా.? సంఘ విద్రోహ శక్తులమా.? మమ్మల్ని ఆపాలని చూస్తున్నారంటే మీరు భయపడుతున్నట్లే. మీ అసమర్థతను కప్పి పుచ్చాలని చూస్తున్నారు. ఎన్ని ఆటంకాలు కలిగించిన నిరుద్యోగుల పక్షాన పోరాటం ఆగదని ఆమె ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు.'ఛలో సెక్రటేరియట్' లో పాల్గొనేందుకు షర్మిల బుధవారం సాయంత్రమే విజయవాడ చేరుకుని పార్టీ కార్యాలయం ఆంధ్ర రత్న భవన్ లోనే బస చేశారు. అయితే, ఆమె బాపులపాడు మండలం అంపాపురం లోని కేవీపీ రామచంద్రరావు నివాసంలో బస చేయాల్సి ఉండగా.. ముందస్తు అరెస్టుల నేపథ్యంలో ఆమె ఆంధ్రరత్న భవన్ లోనే ఉండిపోయారు. రాత్రి నుంచి పోలీసుల దమన కాండ కొనసాగుతోందని.. అక్రమంగా కేసులు పెడతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత గిడుగు రుద్రరాజు మండిపడ్డారు.

# సంపాదకీయం

శుక్రవారం 23-02-2024

## ఫ్రీ బీలనే నమ్ముకున్న తెలుగు రాష్ట్రాలు

ఎన్నికల కోసం ఎడాపెడా హామీలు ఇచ్చి.. ఆ తర్వాత వాటిని అమలు చేయాలంటే ఎంత ఇబ్బంది అవుతుందో.. ఆర్థికంగా ఎంత ఒత్తిడి ఎదురవుతుందో? కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర బడ్జెట్ కళ్లకు కట్టినట్లు వెల్లడి చేస్తోంది. మూడు లక్షల 71 వేల కోట్ల రూపాయల వ్యయంతో కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కోసం నిధుల సమీకరణలో భాగంగా దాదాపు లక్షా ఐదు వేల కోట్ల రూపాయలను అప్పుల రూపేణా సమీకరించుకోవాల్సిన పరిస్థితి కర్నాటక రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురయ్యింది. అంటే బడ్జెట్‌లో 28% మొత్తాన్ని అప్పు చేసి తెచ్చుకోవాల్సి వచ్చింది. కర్నాటక ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు లక్షా 20 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో లక్షా 5 వేల కోట్ల రూపాయలను అప్పుగా తేవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో సంక్షేమ పథకాల అమలు ఎంత కష్టతరం కాబోతోందో ఇట్టే అర్థం అవుతోంది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే 4 లక్షల 35 వేల కోట్ల రూపాయల అప్పు ఉంది. దీనికి కొత్తగా తీసుకు రానున్న అప్పులు అదనం. ఈ ఏడాదికి ఏదో విధంగా అప్పులు తీసుకు రాగలిగినా, వచ్చే సంవత్సరాల్లో ఇది సాధ్యం అవుతుందా అనే ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరంలో 44 వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చే సరికి అప్పుగా తెచ్చిన మొత్తం 85 వేల కోట్ల రూపాయలుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను లక్షా 5 వేల కోట్ల రూపాయల అప్పు తీసుకురానున్నారు. ఇలా ప్రతి ఏటా తీసుకురావాల్సిన అప్పులు పెరిగిపోతుంటే? అప్పు పుట్టే పరిస్థితి ఉంటుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గడచిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా? కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఎడాపెడా హామీలు ఇచ్చిందని, తెలంగాణలోనూ ఇదే ఒరవడి కొనసాగించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ అక్కడ కూడా ఎడాపెడా హామీలు గుప్పించనున్నారనే విస్తృత చర్చ జరుగుతున్న సందర్భంలో.. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడం మున్ముందు ఇబ్బందికరంగా మారనుందనే చర్చ ఇప్పటికే మొదలయ్యింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయితే.. మరో అడుగు ముందుకు వేసి ఎన్నికల హామీలపై కొత్త చర్చకు తెరదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను ఇప్పుడు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం ఏటా దాదాపు 53 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని.. ఈ నిధులు సమీకరించుకోవాలంటేనే తలప్రాణం.. తోకలోకి వస్తోందని జగన్మోహన్‌రెడ్డి బహిరంగంగానే చెప్పారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు కొత్తగా చెబుతున్న వాగ్దానాలను అమలు చేయాలంటే ఏటా మరో 73 వేల కోట్ల రూపాయలు కావాలని, అంటే ఇప్పటికే ఉన్న వాటికి తోడు? కొత్తవి అమలు చేయడానికి ఏడాదికి మొత్తం లక్షా 26 వేల కోట్ల రూపాయలు కావాలని, వీటిని ఎక్కడి నుంచి తెస్తారని జగన్ సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే 7 లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పు ఉన్న నేపథ్యంలో.. జగన్ లేవనెత్తుతున్న ప్రశ్న కొత్త చర్చకు దారితీస్తోంది. ఎన్నికల సందర్భంగా ఎడాపెడా హామీలు ఇచ్చుకుంటూ పోతే? వాటిని అమలు చేయడానికి నిధులు ఎలా ? అప్పులతో ఎంతకాలం నిధులు సమీకరించగలుగుతారు ? హామీలు తలకు మించిన భారంగా మారి చివరకు చేతులెత్తేయాల్సిన పరిస్థితి రాదా ? అదే జరిగితే.. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి రియాక్షన్ ఎలా ఉంటుంది ? దీనికి ముగింపు ఎలా ఉండనుంది ? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అందుకే కర్ణాటక రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన అప్పుల సమీకరణ అంశం మిగిలి రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించేలా ఉంది. ఏటేటా చేస్తున్న అప్పుల విషయానికి వస్తే? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 77 వేల కోట్ల రూపాయల అప్పులు చేయగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 86 వేల 612 వేల కోట్ల రూపాయల అప్పులు తేవాల్సి ఉంటుందని అంచనా వేశారు. తెలంగాణ ప్రభుత్వం విషయానికి వస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 43 వేల 115 కోట్ల రూపాయల అప్పులు తీసుకురాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 64 వేల 525 కోట్ల రూపాయల అప్పు తీసుకురావాల్సి ఉంటుందని అంచనా వేశారు. ఇటు ఆంధ్రప్రదేశ్, అటు తెలంగాణ రాష్ట్రాలు రెండూ ఇప్పటికే భారీగా పేరుకుపోయిన అప్పులతో సతమతమవుతున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఈ అప్పుల భారం పెరిగిపోయి? కొత్త అప్పులు పుట్టడం రాష్ట్ర ప్రభుత్వాలకు కష్టమవుతుందనే అభిప్రాయం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ కోసం కొత్త నిబంధనలు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల పరంగా ఎదురయ్యే పరిస్థితిని ఊహించుకోవడమే కష్టంగా ఉంటుంది.

# పట్టణంలో విస్తరిస్తున్న శిల్పా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు

### శిల్పాసేవాసమితి చైర్ పర్సన్ నాగినిరవిసింగారెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-నంద్యాల పట్టణం 17వ వార్డు విశ్వనగర్లో మంగళవారం శిల్పా సేవాసమితి ఆద్వర్యంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవిసింగారెడ్డి శిల్పా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా 60 మంది మహిళలకు టైలరింగ్ నందు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నాగినిరవిసింగారెడ్డి మాట్లాడుతూ... నంద్యాల పట్టణంలో గత 25 సంవత్సరాలుగా శిల్పాసేవాసమితి ఆద్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు ప్రధానంగా శిల్పా మహిళా సహకార్ బ్యాంక్, శిల్పా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 17వ వార్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉచితంగా మహిళలకు కుట్లు, అల్లికలు, తదితర వాటి యందు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందన్నారు. ఇలా మహిళలకు ఆర్థికంగా భలోపేతం కావాలని, ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, స్థానిక కౌన్సిలర్ సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

# నరసింహారెడ్డి బలిదానం...





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 22 డోన్ పట్టణం, పాతపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన, స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి, తాంత్యాతోపే వంటి వీరులు నిర్వహించిన 1857వ సం. పోరాటానికి 10 సంవత్సరాల ముందే ఆంగ్లేయులను తరిమి వేయడానికి కత్తిపట్టిన వీరుడు "ఉయ్యాలవాడ నరసింహారెడ్డి" అని అన్నారు. బ్రిటన్ నుండి వచ్చిన ఆంగ్ల అధికారులతో సహా కిరాయి సైనికులను కలుపుకొని నరసింహారెడ్డి కత్తికి బలైన వారి సంఖ్య 700 కు పైగానే ఉంటుంది. ఈ సందర్భంగా ఎన్.ఎస్. బాబు మాట్లాడుతూ శత్రువులను ఊచకోత కోసిన వీరి పౌరుషానికి, పరాక్రమానికి హడలిపోయిన ఆంగ్లేయులు 173 సంవత్సరాల క్రితం అనగా 22 ఫిబ్రవరి 1847 సం. నాడు కుట్రతో వెన్నుపోటు పొడిచి బంధించి తదుపరి ఉరితీశారు. వీరి వెంట ఉన్న స్వాతంత్ర్య వీరులను అనేకమందిని అంగవికలురుగా చేశారు. ఎంతో మందిని ద్వీపాంతర వాస శిక్ష కోసం ఎక్కడికో ఓడల పైన పంపించారు. ఆ తదుపరి వారి జాడ తెలియలేదు. ఉరి తీయబడిన వారి శరీరాన్ని దహనం చేయడానికి అనుమతినివ్వక కోవెలకుంట్ల కోట గుమ్మానికి అలాగే వేలాడదీసి ఉంచారు. శరీరం అంతా శిథిలమైపోగా వారి తలను 30 సం.లు వ్రేలాడతీసారు, ఇలా చావు భయంతో భయపెట్టి స్వాతంత్ర్య పోరాటాన్ని ఆపవచ్చునుకున్న తెల్లోడి ఆశలు అడియాశలే అయ్యాయి. ఈ 30 సంవత్సరాల కాలంలో వ్రేలాడుతున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తలను దర్శించుకోవడం కోసం దేశంలోని నలుమూలల నుండి దేశభక్తులు వచ్చేవారు. ముఖ్యంగా బెంగాల్ నుండి అనేకమంది వచ్చి దర్శించుకుని ప్రేరణ పొందేవారనీ హిందీ సాహిత్యకారులు వ్రాశారు. ఇలా దేశంకోసం, మన ధర్మంకోసం పోరాటం చేసి బలిదానమయి అజ్ఞాతంగా ఉండిపోయిన అనేకమంది వీరుల యొక్క త్యాగాన్ని ఇప్పటి తరానికి తెలుపడం ద్వారా వారిని గుర్తు చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, రవిశేఖర్, వెంకట రమణ, వెంకట లక్ష్మి, లక్ష్మయ్య ,రాధ, రఘునాథ్, లక్ష్మి కాంత రెడ్డి, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మి ప్రభావతి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, మునిరాజు, అల్లిపీరా,తదితరులు పాల్గొన్నారు

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, 10వ తరగతి, డి ఎస్ సి., టెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సి, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్



కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.కె శ్రీనివాసులు, డిఇఓ సుధాకర్ రెడ్డి, ఆర్ఐఓ సునీత తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, 10వ తరగతి, డి ఎస్ సి., టెట్ పరీక్షలకు సుమారు 50 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లను సూచించారు. పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడకుండా, ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చుకోవాలని మంత్రి తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులతో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఇటీవలే సమావేశం నిర్వహించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ లను, పరీక్షా కేంద్రాల సమీపాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్త్ తో పాటు 144 సెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

# రవి కిషోర్, సంధ్య ల వివాహానికి హాజరైన ఆర్యవైశ్య సంఘ సభ్యులు




విభారె న్యూస్ ఫిబ్రవరి 22 ఎమ్మిగనూరు. రవి కిషోర్, సంధ్య లు దంపతులుగా ఒకటైన ఈ శుభ సందర్భంలో ఆర్యవైశ్య సంఘం తరఫున వివాహ శుభాకాంక్షలు. ఆర్యవైశ్య సంఘం వారు ఈ నూతన వధూవరులకు ఆశీర్వాద పంచరత్న పత్రాల పటములను అందజేసి వారిరువురిని ఆశీర్వదించడం జరిగినది. ఈ శుభ సందర్భంలో వరద చంద్రశేఖర్ దంపతులు ఆర్యవైశ్య సంఘానికి 10,116/-లు, వీరి వియ్యంకులు కర్నూలు పట్టణ వాస్తువులైన తక్కశిల సాయి ప్రసాద్ దంపతులు 3,116/-లు విరాళం ఇవ్వడం జరిగినది. మన కుల దేవత శ్రీ వాసవి మాత కృపా కటాక్షాలతో వీరు ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో హాయిగా జీవించాలని మనసారా కోరుకున్నారు

# పత్రికలు, మీడియా స్వేచ్ఛను హరిస్తున్న... వైసిపి



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 22 వైసీపీ నాయకులు బరితెగించి పత్రికలు, మీడియా రంగం పై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గు చేటని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ క్రిష్ణ పై, ఈనాడు కార్యాలయం పై వైసీపీ వరుస దాడులతో బయటపెట్టి మరోసారి తిరిగి అధికారం చేపట్టాలనే దురుద్దేశంతో దాడులు చేస్తున్నారని, ఇది వారి ప్రణాళికలో ఒక భాగమే అని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి వారి పార్టీ నాయకులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. ఈ దాడులను చేస్తున్న వైసిపి గూండాలను అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనీ అన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి విఘతమే నని ,పత్రిక, మీడియా స్వేచ్ఛను వైసిపి ప్రభుత్వం హరిస్తూ... ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తుందని అన్నారు. వైసీపీ తాటాకు చప్పుళ్లుకు భయపడే ప్రసక్తేలేదని , పోలీస్ అధికారులు దాడులు చేసిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని. మరల ఇటువంటి వి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం ఉండీ ఆదాయం 71రోజులకు 77,64,241.రూ-

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-నంద్యాల జిల్లా మహానంది దేవస్థానం అధికారులు గురువారం మహానంది దేవస్థాన అభిషేక మండపం యందు నిర్వహించిన ఉభయ ఆలయముల హుండీ లెక్కింపు ద్వారా 71 రోజులకు భక్తులు సమర్పించిన కానుకల వివరములు. ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి గురువారం వెల్లడించారు .ఆలయాలు 75,97,586/-అన్న ప్రసాదం 1,27,229/- గోవు సంరక్షణ 39,426/- మొత్తం 77,64,241/- ఇతర దేశముల కరెన్సీ కూడా వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు చేయుటకు దేవాదాయ శాఖా తరుపున వెలుగోడు గ్రూప్ దేవాలయముల కార్యనిర్వహాణాధికారి వి జనార్ధన ,దేవస్థానం ఎఈఓ వై మధు, పర్యవేక్షకులు ఓంకారం వేంకటేశ్వరుడు , టెంపుల్ ఇన్స్పెక్టర్లు బి నాగ భూషణం, డి రంగన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఏజెన్సీ వర్కర్స్, పలు గ్రామముల నుండి వచ్చిన సేవకులు పాల్గొన్నారని తెలిపారు



# గందరగోళంలో టిడిపి,జనసేన

## మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా

సత్తెనపల్లి,ఫిబ్రవరి22 ): టీడీపీ, జనసేన పార్టీలు గందరగోళంలో ఉన్నాయని, ఎవరు ఎక్కడ పోటీ చేస్తారో తెలీదంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. గురువారం ఆయన సత్తెనపల్లెలో మీడియాతో మాట్లాడుతూ, ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేస్తారో కూడా తెలీదు. చంద్రబాబు, పవన్ రెస్ట్ తీసుకోవాల్సిన టైం వచ్చింది. ఏ పార్టీకి విశ్వాసం లేని వ్యక్తి నాపై పోటీకి దిగుతున్నాడు. ఇద్దరు విశ్వాస ఘాతకులు నాపైనా, అనిల్‌పైనా పోటీ చేస్తున్నారు. పార్టీలు మారిన వ్యక్తులు మాపై పోటీ చేస్తున్నారు. విశ్వాస ఘాతకులను తరిమికొట్టాలని సత్తెనపల్లి ప్రజలను కోరుతున్నానని మంత్రి అంబటి పిలుపునిచ్చారు. 'చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది. ఓట్లు కొనాల్సిందేనని పవన్ మాటలతో అర్థమవు తోంది. చంద్రబాబుతో పొత్తు అంటే బీజేపీ జాతీయ నేతలు ఎందుకు తిట్టకుండా ఉంటారు. బీజేపీతో పొత్తులో ఉండి చంద్రబాబుతో పొత్తు ఏంటి?. రానున్న రోజుల్లో పవన్ మరిన్ని చివాట్లు తింటారు. భువనేశ్వరి వ్యాఖ్యలను చంద్రబాబు ఖండించలేదు.

# మారుతున్న పొత్తుల లెక్కలు

విజయవాడ, ఫిబ్రవరి 22 ఏపీలో పార్టీల మధ్య పొత్తులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే జనసేనతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుంది. మరోవైపు బిజెపి సైతం ఈ కూటమిలోకి రానుంది. సీట్ల సర్దుబాటు ప్రక్రియ సైతం తుది దశకు చేరుకుంది. దాదాపు ఖరారైనట్లు సమాచారం. మూడు పార్టీలు ఉమ్మడి వేదికగా పొత్తు ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.అనేక ప్రతిపాదనలు, చర్చల అనంతరం దాదాపు అభ్యర్థుల జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. జనసేనతో గతంలో పూర్తయిన సీట్ల ప్రతిపాదనలు..బిజెపి రాకతో తారుమారైనట్లు తెలుస్తోంది. మూడు పార్టీల మధ్య పొత్తులు కుదరడంతో.. 2014 నాటి అంశాలు రిపీట్ అయ్యే అవకాశం ఉంది.రెండు రోజుల్లో పొత్తులపై ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.జనసేన 30 అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్ సీట్లు ఇచ్చేందుకు చంద్రబాబు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. గతంలో 25 నుంచి 28 అసెంబ్లీ స్థానాలు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 30 అసెంబ్లీ స్థానాలకు తగ్గకుండా చూసుకోవాలని పవన్ భావించారు. అందుకే చంద్రబాబుపై ఒత్తిడి పెంచారు. చంద్రబాబు సైతం సమ్మతించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని పవన్ రాజమండ్రి పర్యటనలో స్పష్టం చేశారు. బిజెపి పొత్తులో కలిసి వస్తుందని.. కానీ వారిని ఒప్పించే బాధ్యత తీసుకున్నట్లు పవన్ వెల్లడించారు. బిజెపికి అంశం పైన ప్రాథమికంగా నిర్ణయించుకున్నట్లు సమాచారం.బిజెపికి ఎంపి స్థానాలు కీలకంగా కావడంతో.. పొత్తులో భాగంగా సింహభాగం లోక్ సభ స్థానాలు ఆ పార్టీకి కేటాయించినట్లు తెలుస్తోంది. ఐదు ఎంపీ స్థానాలతో పాటు 12 ఎమ్మెల్యే స్థానాలను బిజెపికి పొత్తులో భాగంగా కేటాయించినట్లు తెలుస్తోంది.

# ముద్రగడకు దారేది ?



కాకినాడ, ఫిబ్రవరి 22 కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను పవన్ కల్యాణ్ కలవలేదు. గోదావరి జిల్లాల పర్యటనకు వచ్చి చాలా మందిని కలిశారు కానీ ముద్రగడ వైపు వెళ్లలేదు. మొదట వైసీపీలో చేరుతున్నారని ప్రచారం జరిగింది. ఆయనకు ఎంపీ లేదా ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ సిద్ధమయ్యారని.. జనవరి ఒకటో తేదీన వైసీపీలో చేరే ప్రకటన చేస్తారని అనుకున్నారు. కానీ ఆయనకు ఎక్కడా టిక్కెట్ ఇచ్చేందుకు ఆసక్తి చూపకపోవడం.. టిక్కెట్ల కసరత్తు లో అసలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యారు. వైసీపీలో చేరడం లేదని ప్రకటించారు. దీంతో ఆయన జనసేనలో చేరబోతున్నారని జోరుగా ప్రచారం జరిగింది. ముద్రగడను కలిసిన జనసేన నేతలు.. పవన్ కల్యాణ్ ఇంటికి వచ్చి మరి పార్టీలోకి ఆహ్వానిస్తారని ఆయనకు భరోసా కల్పించారు. అయితే, ఈ ప్రచారం నెల రోజులు దాటినా కూడా ముద్రగడను మాత్రం జనసేనాని కలవలేదు. రెండు రోజుల వ్యవధిలో భీమవరం, రాజమండ్రిలో పర్యటించినప్పటికి ముద్రగడను పవన్ కళ్యాణ్ పట్టించుకోలేదు. దీంతో, ముద్రగడ పొలిటికల్ రీఎంట్రీ లేనట్లేనని తెలుస్తోంది. ఏపీలో ఇప్పటికే జనసేన తప్ప మిగితా అన్ని పార్టీలు ముద్రగడకు డోర్స్ క్లోజ్ చేసినట్లేనని అర్థమవుతోంది. పవన్ రాకపై ముద్రగడ స్పందిస్తూ కీలక వ్యాఖ్యాలు చేశారు. మనం చెప్పాల్సింది చెప్పాం తర్వాత మనం..చేసేది ఏమి లేదంటూ చెప్పుకొచ్చారు. పది సంవత్సరాలుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ముద్రగడ..త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు హల్ చల్ చేశాయి. ఏపీ రాజకీయాల్లో కాపు ఉద్యమనేతగా పేరు పొందారు ముద్రగడ పద్మనాభం. గతంలో జనసేన అధినేతపై విమర్శలు, సెటైర్లతో లేఖలు రాశారు. దమ్ముంటే తనపై పోటీ చెయ్యాలంటూ పవన్ కల్యాణ్‌కు సవాల్ విసురుతూ లేఖ రాశారు. దీంతో జనసైనికుల మధ్య ముద్రగడ మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది.ముద్రగడ పద్మనాభం కాపు సామాజికవర్గంలోనూ తన పలుకుబడి కోల్పోయారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసింది. అయితే ఈ అంశంపై ముద్రగడ పద్మనాభం పెద్దగా స్పందించలేదు. పైగా తనను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నందన తాను ఉద్యమం నుంచి వైదొలుగుతున్నానని ప్రకటించారు. చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు ప్రభుత్వాన్ని సమర్థించారు. ఇలాంటి పరిణామాలతో ముద్రగడ రాజకీయంగా పలుకుబడి కోల్పోయారని రాజకీయ వర్గాలంటున్నాయి.

# బయటకు రాని నల్లారి



తిరుపతి, ఫిబ్రవరి 22 మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఏపీలో జమిలీ ఎన్నికల వేడి పెరిగిన సమయమంలో కనిపించకుండా పోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తర్వాత సొంత పార్టీ పెట్టుకున్నారు. కొన్నాళ్లకు మళ్లీ సొంత పార్టీలో చేరారు. కానీ అక్కడ ఉండలేక కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. కానీ ఆయన ఎప్పుడూ యాక్టివ్ పాలిటిక్స్ లో కనిపించడం లేదు. తెలంగాణ ఎన్నికల సమయంలో సీమాంధ్ర ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయన ఉపయోగపడతారని కమలం పార్టీ అంచనా వేసింది. కొన్ని సమావేశాల్లో కనిపించారు.కానీ విజయశాంతి వంటి నేతలు విమర్శలు చేశారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణలో పార్టీ కార్యాలయానికి రాగానే విజయశాంతి గుర్రుగా చూశారు. సమైక్య వాది మన పార్టీలోకి రావడమేంటని జాతీయ పార్టీ మహిళ నేత కస్సుమన్నారు. ఆమె వేదికపైకి ఎక్కకుండానే వెళ్లారు. తెలంగాణ ద్రోహులను పార్టీలోకి తీసుకున్నందుకు తాను వేదికపైకి వెళ్లలేదని కూడా విజయశాంతి చెప్పారు. ఆ తర్వాత ఆయన మరే సమవేశానికి హాజరు కాలేదు. ఇప్పుడు ఏపీ ఎన్నికలు వచ్చేసినా ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఇక కాంగ్రెస్ లో కొన్నేళ్లు పాటు ఉన్నా సైలెంట్ గా ఉన్న కిరణ? కుమార్ రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత యాక్టివ్ అవుతారని భావించారు. అయితే ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేయడంతో ఇటు తెలంగాణకు, అటు ఆంధ్రప్రదేశ్ లో జరిగే ఎన్నికలకు బాగా పనికొస్తాడని పార్టీలో చేర్చుకున్నారు. పైగా మాజీ ముఖ్యమంత్రి కావడంతో ప్లస్ పాయింట్ అయింది. ఆయన పార్టీలో చేరితే రెడ్డి సామాజికవర్గం ఓటర్లు కమలం వైపు చూస్తారని భావించారు. కానీ కిరణ్ కుమార్ రెడ్డి వల్ల బీజేపీకి ఎలాంటి మేలు జరగలేదన్న వాదన వినపిస్తోంది. తెలంగాణ ఎన్నికల సమయంలో తెర వెనుక పాత్ర పోషించే ప్రయత్నం చేసినా వర్కవుట్ కాలేదు. దాంతో ఆయన రాజకీయాల్లో కనిపించడం మానేశారు. ఏపీ బీజేపీ కార్యక్రమాల్లో అసలు పాల్గొనడం లేదు. పార్టీలో చేరినప్పుడు ఏపీకి వచ్చి ఒక మీడియా సమావేశం పెట్టి కనిపించి వెళ్లిపోయారు. తర్వాత బీజేపీ అధ్యక్షురాలు పురంద్రీశ్వరి బాధ్యతలను చేపట్టే సమయంలో కనిపించారు. ఇక అంతే ఆయన అడ్రస్ లేదు. హైదరాబాద్ లోనే ఉంటున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇక్కడా, అక్కాడ కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. సమైక్యాంధ్ర కోసం పోరాడిన ఏపీలోనైనా ఆయన కాలు కదుపుతారనుకుంటే అది కమలనాధులకు అత్యాశే మిగిలింది. ప్రస్తుతం ఏపీలో పొత్తుల చర్చలు నడుస్తున్నాయి. ఇలాంటి సమయంలో కీలక స్థానాల్లో తాము పోటీ చేస్తామంటూ కొంత మంది ముందుకు వస్తున్నారు. కానీ కిరణ్ కుమార్ రెడ్డి పేరు మాత్రం అసలు ప్రచారంలోకి రావడం లేదు.

# పక్క చూపులు చూస్తున్న శ్రీనుబాబు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 22 ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, పల్సస్ సంస్థ అధినేత గేదెల శ్రీనుబాబు రాజకీయ అడుగులు ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఇప్పటికీ రైతు, యువత పేరుతో సదస్సులు నిర్వహిస్తూ.. రైతుల ఆదాయాన్ని పెంచే ప్రణాళికలు, యువతకు ఉద్యోగాలు కల్పించడంపై త నకు విజన్‌ను వివరిస్తూ అనేక సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి శ్రీనుబాబు వెళుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన రాజకీయంగా యాక్టివ్ కావాలన్న కోరికను అనేక చోట్ల బయటపెట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో అత్యధిక జనాభా ఉన్న కాపు సామాజికవర్గాని చెందిన ఆయన.. గత ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. కానీ, చివరి నిమిషంలో వైసీపీలో చేరిపోయి ఆ పార్టీ ప్రకటించిన ఎంవీవీ సత్యనారాయణకు మద్ధతు ప్రకటించారు.వైసీపీ అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు పూర్తి కావస్తోంది. కానీ, శ్రీనుబాబుకు ఆ పార్టీ అధిష్టానం ఆశించిన స్థాయిలో ప్రధాన్యతను ఇవ్వలేదు. ఆయన కూడా పార్టీతో అంటీ ముట్టనట్టుగానే ఇన్నేళ్లు ఉంటూ వచ్చారు. మరి కొద్దిరోజుల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆయన యాక్టివ్ అయ్యారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు సభలు,ర సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన టీడీపీలోకి వెళతారన్న జోరుగా సాగుతోంది. అందుకు అనుగుణంగా ఆయన ప్రయత్నాలు సాగిస్తున్నారని చెబుతున్నారు. టీడీపీలో చేరాలని గేదెల శ్రీనుబాబు నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ఆయన టీడీపీ నేతలతో వరుసగా సమావేశమవుతున్నారు. శంఖారావం సభల్లో పాల్గొనేందుకు విశాఖకు వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శ్రీనుబాబు వెళ్లి కలిశారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని ఆ పార్టీలోని సీనియర్ నేతలు పూసపాటి అశోక్ గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావుతోపాటు బొబ్బిలిలో బేబీ నాయనతోపాటు పలువురు కీలక నేతలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారితో రాజకీయపరమైన అంశాలను చర్చించినప్పటికీ వాటిని బయట పెట్టడం లేదు. టీడీపీలో చేరే క్రమంలోనే శ్రీనుబాబు ఆ పార్టీ నేతలతో సమావేశమవుతున్నట్టు చెబుతున్నారు. ఆయన కానీ,

ఆయన అనుచరులు కానీ ఈ విషయాన్ని ఎక్కడా చెప్పడం లేదు. పల్సస్ సంస్థ అధినేతగా, యువతకు ఉపాధి కల్పించిన వ్యక్తి, తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన పారిశ్రామికవేత్తగా ఈ ప్రాంత ప్రజలకు గేదెల శ్రీనుబాబు సుపరిచితులు. ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ రాజకీయంగా మాత్రం ఆశించిన స్థాయిలో పేరు, ప్రఖ్యాతలు సంపాదించలేకపోయారు. రానున్న ఎన్నికల్లో మాత్రం పార్లమెంట్ స్థానానికి బరిలో దిగేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలోనే విజయనగరం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. అందులో భాగంగానే విజయనగరం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన కీలక నేతలతో గేదెల శ్రీనుబాబు వరుసగా భేటీ అవుతూ వస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కూడా బలమైన వ్యక్తి కోసం ఇక్కడ అన్వేషిస్తోంది. పార్టీ నుంచి సానుకూల స్పందన వస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు.

# విజయనగరం..ఎవరికి వరం

విజయనగరం, ఫిబ్రవరి 22 విజయనగరం జిల్లాలోని మరో అసెంబ్లీ నియోజకవర్గం విజయనగరం. విజయనగరం హెడ్ క్వార్టర్(నగర) పరిధి మొత్తం ఈ నియోజకవర్గంలో భాగంగా ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ 18 సార్లు ఎన్నికలు జరిగాయి. అత్యధిక సార్లు ఇక్కడ తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఈ నియోజకవర్గం నుంచి ఎక్కువసార్లు టీడీపికి చెందిన అశోక్ గజపతిరాజు విజయం సాధించి రికార్డు సృష్టించారు. నియోజకవర్గ పరిధిలో 2,12,092 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,05,161 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,06,928 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. తొలి ఎన్నిక 1952లో జరిగిందిఇప్పటి వరకు 18 సార్లు ఈ నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నిక 1952లో జరిగింది. ఈ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన జి సూర్యనారాయణ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సి సూర్యనారాయణపై 41,056 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన పీవీ రాజు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన జి అప్పలస్వామిపై 36,463 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1953లో సభకు ఉపఎన్నిక జరగ్గా పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పీఎస్పీ నుంచి పోటీ చేసిన పీవీజీ రాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బీవీ సంజీవరావుపై 24,128 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1957లో జరిగిన ఉప ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తి తన సమీప ప్రత్యర్థి బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావుపై 30,649 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1967లో జరిగిన ఎన్నికల్లో బీజేఎస్ నుంచి పోటీ చేసిన వి రామారావు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బాట్టం శ్రీరామమూర్తిపై 18,359 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొర ఇక్కడి నుంచి విజయం సాధించారు. బీజేఎస్ నుంచి పోటీ చేసిన పి అనవిళ్లపై 23,916 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అప్పసాని అప్పన్నదొరపై 26,085 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పీఆర్ కృష్ణపై 40,392 ఓట్లతో గెలుపొందారు. 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ అశోక్ గజపతిరాజు టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఎంఎస్ రావుపై 37,969 ఓట్ల తేడాతో అశోక్ గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మరోసారి బరిలోకి దిగిన అశోక్ గజపతిరాజు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 9747 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన అశోక్ గజపతిరాజు ఐదోసారి విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మరోసారి బరిలోకి దిగిన కోలగట్ల వీరభద్రస్వామిపై 21,031 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజు ఆరోసారి వరుసగా విజయాన్ని దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై వరుసగా మూడోసారి 9131 ఓట్ల తేడదాతో విజయం సాధించారు.2004లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి అశోక్ గజతిపరాజు ఓటమి చవి చూశారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి చేతిలో 1126 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి టీడీపీ నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వీరభద్రస్వామిపై 3282 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన మీసాల గీత ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైసీపీ నుంచి పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామిపై 15,404 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన అతిథి గజపతిరాజుపై 6417 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. విజయనగరం అసెంబ్లీ స్థానం విజయనగరం రాజుల అడ్డాగా నిలుస్తూ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. ఇప్పటి వరకు అశోక్ గజపతిరాజు ఇక్కడి నుంచి ఏడుసార్లు విజయాన్ని దక్కించుకున్నారు. ఒకేఒక్కసారి ఆమె ఓటమి పాలయ్యారు. గడిచిన ఎన్నికల్లో తన కుమార్తెను ఈ స్థానం నుంచి బరిలోకి దింపారు. ఆమె కూడా పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి మరోసారి అశోక్ బరిలో దిగేందుకు సిద్ధపడుతున్నారు. వైసీపీ నుంచి కోలగట్ల వీరభద్రస్వామి పోటీ చేయనున్నారు. వచ్చే ఎన్నిక మరింత ఆసక్తిరకంగా ఉండనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# హంద్రీనీవా చుట్టూ రాజకీయాలు

తిరుపతి, ఫిబ్రవరి 22 హంద్రీనీవా నీటి చుట్టూ వైసీపీ ? టీడీపీ మధ్య నడుస్తున్న రాజకీయం రంజుగా మారింది. హంద్రీనీవా ద్వారా కుప్పం బ్రాంచ్ కెనాల్ నీళ్లు తెచ్చింది మేమేనంటూ వైసీపీ, నిధులు కేటాయించింది 90 శాతం పనులు పూర్తి చేసింది చంద్రబాబు హయంలోనేనని టీడీపీ. ఇలా రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం రాజుకుంది. పులివెందులకు నీళ్లు ఇచ్చింది తానేనంటూ చంద్రబాబు పదే పదే చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్ ఎటాక్ ఇస్తున్న వైసీపీ కుప్పంకు నీళ్లు తెరపైకి తీసుకొచ్చింది. దీంతో నీళ్ళ లొల్లి కాస్తా.. పొలిటికల్ హీట్ ను పెంచింది.తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇలాకా లో ఇప్పుడు హంద్రీనీవా ఇష్యూ హాట్ టాపిక్ అయ్యింది. ఫిబ్రవరి 26న సీఎం వైఎస్ జగన్ కుప్పం పర్యటన కాక రేపుతోంది. కృష్ణా జలాలను పులివెందులకు తెచ్చింది తానేనని చంద్రబాబు, కుప్పంకు నీళ్లు ఇచ్చింది తమ ప్రభుత్వమేనని వైసీపీ చెప్పు కుంటుండటం ఇప్పుడు పొలిటికల్ చర్చకు దారితీసింది. పులివెందులకు నీళ్లు ఇచ్చింది తానేనని చెబుతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు వైసీపీ సర్కార్ కూడా గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. 14 ఏళ్ళు సీఎంగా చంద్రబాబు కుప్పంకు నీళ్లు కూడా అందించలేక పోయారంటున్నారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్తూరు జిల్లాకు చేసిందేమీ లేదంటోంది. హంద్రీనీవా నీటిని సీఎం వైఎస్ జగన్ పూజ చేసి కుప్పం ప్రజలకు అందిస్తారని మంత్రి పెద్దిరెడ్డి అంటున్నారు.కుప్పంకు నీళ్లు అందించాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ ఉన్నారంటున్నారు. ఫిబ్రవరి 26 న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పూజలు చేయించి హంద్రీనీవా నీటిని కుప్పం నియోజకవర్గానికి అందిస్తామంటున్నారు మంత్రి పెద్దిరెడ్డి. అయితే తెలుగుదేశం పార్టీ వాదన మరోలా ఉంది. పులివెందులకు కృష్ణా జిల్లాలోని గండి కోట ద్వారా అందించిన ఘనత తమదేనంటున్నారు టీడీపీ నేతలు. కుప్పంకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చిన క్రెడిట్ వైసీపీది మాత్రం కాదంటోంది.ఒక టీఎంసీ కెపాసిటీ తో హంద్రీనీవా నీటిని కుప్పం బ్రాంచ్ కెనాల్ కు తరలించాలని సంకల్పించింది మేమే అంటోంది టిడిపి. కృష్ణా జలాలను తీసుకుని రావాలనుకున్న చంద్రబాబు రూ. 613 కోట్లు కేటాయించి 2014-19 మధ్య కాలంలో పనులు చేపట్టారని టీడీపీ నేతలు అంటున్నారు. రూ. 520 కోట్లు ఖర్చు చేసి 87శాతం పనులు కూడా పూర్తి చేశారంటున్నారు. పైగా కోర్టులకు వెళ్లి కెనాల్ పనులు నిలిచి పోయేలా చేసింది వైసీపీ నేతలేనని ఆరోపిస్తోంది. మిగిలిపోయిన 13 శాతం పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు వైసీపీ సర్కార్‌కు నాలుగేళ్ల పది నెలలు కాలం పట్టిందని విమర్శిస్తున్నారు టీడీపీ నేతలు. పూర్తి చేసిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని హంద్రీనీవాకు పూర్తి స్థాయిలో నీళ్లు రాకపోవడంతో ఇప్పటికే సీఎం పర్యటనలు మూడుసార్లు వాయిదా వేసుకున్న వైసీపీ నేతలు ఇకనైనా మోసపూరిత మాటలు మాను కోవాలంటున్నారు టీడీపీ ఎంఎల్సీ కంచర్ల శ్రీకాంత్. పులివెందులకు చంద్రబాబు హయంలోనే నీళ్లు అందించారని గంటాపథంగా చెబుతున్నారు

## గ్రామ ప్రజారోగ్యానికి జవసత్వాలు..

**- మసీదుపురంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, సచివాలయం కొత్త భవనాలు ప్రారంభించిన : ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక..**



విభారె న్యూస్ ఫిబ్రవరి 22ఎమ్మిగనూరు..22-02-2024 తేదీన ఎమ్మిగనూరు మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో నూతనంగా సచివాలయం,వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను స్థానిక ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకురానుంది.ప్రస్తుతం ఉన్న యూహెచ్‌సీ భవనాలకు మెరుగులు దిద్దడంతో పాటు కొత్త సెంటర్ల ఏర్పాటు కోసం భవనాలను నిర్మిస్తోంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు అభిమానులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ..

**మైనారిటీ విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం వైస్ ఛైర్మెన్ నజీర్ అహమ్మద్,వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్..**




ఎమ్మిగనూరు : గ్రూప్-2 మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ ను అందజేస్తున్న వైసిపి నాయకులు



విభారె న్యూస్ ఫిబ్రవరి 22 ఎమ్మిగనూరు.. ఎమ్మిగనూరుఏ పి పి ఎస్ సి గ్రూప్ 2 ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులైన ముస్లిం మైనారిటీ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రూప్ 2 పోస్టులకు సంబంధించి ఎమ్మిగనూరు పట్టణంలోని అర్.ఎం.కె కోచింగ్ సెంటర్ లో ఉచిత కోచింగ్ ఇవ్వటమే కాకుండా గురువారం స్టడీ మెటీరియల్ పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్,వైసిపి పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు. మైనారిటీ విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.ఉచిత కోచింగ్ ను ఆర్ఎంకే వారు నిర్వహించడం సంతోషమని కొనియాడారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఛైర్మెన్ కొమ్మురాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రుక్మాన్, అర్ఎంకే కోచింగ్ నిర్వాహకు రాలు ఆశలుక్మాన్, విద్యార్థి సంఘం నాయకులు నరసప్ప,అబ్దుల్ రజాక్, మైనారిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మహిళ ఉద్యోగిని..

విభారె న్యూస్ ఫిబ్రవరి 22 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ఏసీబీ దాడులు మార్కెట్ కమిటీ సుపర్డెంట్ ఉమా మహేశ్వరి ను పట్టుకున్న ఏసిబి అధికారులు 15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉమా మహేశ్వరి కూరగాయల హోల్ సేల్ లైసెన్స్ మంజూరు పత్రం ఇవ్వడానికి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉమా మహేశ్వరి. కూరగాయల మార్కెట్ వ్యాపారి రఘు,వినయ్ లు ఏసీబీ ను ఆశ్రయించారు.



## విద్యా శాఖ మంత్రి చే ఆప్టా డైరీ ఆవిష్కరణ

విభారె న్యూస్ ఫిబ్రవరి 22 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..బుధవారం రోజు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) 2024 డైరీ ఆవిష్కరణ చేయటం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్య లను పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, పెండింగ్ లో ఉన్న బకాయిలు అన్ని మొన్న చర్చల సందర్భంగా చెప్పిన విధంగా చెల్లింపులు జరుపుతారు అని తెలియ చేశారు.ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతి రావు 98 ఏం టి ఎస్ గా అప్పాయింట్మెంట్ అయిన టీచర్స్ జీతాల చెల్లింపు జరగ లేదని మంత్రి తో చెప్పగా వెంటనే అధికారులతో మాట్లాడి చెల్లింపులు చేయమని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు 98 ఎం టి ఎస్ వారిని రెగ్యులర్ చెయ్యమని కోరగా ఆ విషయం పరిశీలన లో వుందని చెప్పారు.తదనంతరం సెక్రటేరియట్ లో పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ని ఆప్టా నాయకులు కలిసి పలు ఉపాధ్యాయ సమస్యల ను ఆయన దృష్టికి తేవడం జరిగింది. వారు త్వరలోనే వాటిని పరిష్కారం చేస్తామని ఒకసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో గుర్తింపు వున్న సంఘాలు అన్నిటి తో తాను ప్రత్యేక సమావేశం ను ఏర్పాటు చేస్తాను అని హామీ ఇచ్చారు.పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ కి ఆప్టా డైరీ, ఉపాధ్యాయ సమస్యల పై వినతి అంద చేయటం జరిగింది.ఆప్టా నాయకత్వం పాఠశాల విద్యా శాఖ అదనపు కార్యదర్శి భాస్కర్ ని,ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవనందారెడ్డి ని, ఎస్



సి ఈ అర్ టి డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి ని, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ శ్రీమతి పార్వతిని,రవీంద్రా రెడ్డిని, జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంని,జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డిని, గుంటూరు కృష్ణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యం ల్. సి శ్రీమతి కల్పలతని కలవటం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతి రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సేవా లాల్ నాయక్, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్, విజయ నగరం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణా రావు నెల్లూర్ జిల్లా అధ్యక్షుడు డేవిడ్ మరియు పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివరాం రామారావు మొదలైన నాయకులు పాల్గొన్నారు..

## నంద్యాల చెన్నై బస్ సర్వీస్ పునః ప్రారంభం:ఎంపీ,ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి పునర్ వైభవానికి తమ వంతు కృషి చేస్తామని ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పేర్కొన్నారు. గురువారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ నందు ఆర్ఎం.రజియా సుల్తాన్ ఆధ్వర్యంలో నంద్యాల చెన్నై బస్ సర్వీసు(6444) ను ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పునః ప్రారంభించారు. ప్రయాణికులు బస్ సర్వీస్ లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆర్టీసీ అభివృద్ధికి పునర్ వైభవానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గతంలో నంద్యాల నుండి చెన్నైకి ఉన్న బస్సు సర్వీస్ నిలుపుదల కావడం జరిగిందన్నారు. అయితే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డితో సంప్రదించి తిరిగి నంద్యాల చెన్నై బస్ సర్వీసును పునః ప్రారంభించడం జరిగిందన్నారు.ఆర్ఎం మాట్లాడుతూ... నంద్యాల చెన్నై బస్ సర్వీసును ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల కృషితో తిరిగి పున ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ బస్సు సర్వీస్ ప్రతి రాత్రి నంద్యాల నుండి 9 గంటలకు బయలుదేరి చెన్నైకి 6గంటల 45 నిమిషాలకు చేరుతుందని, అలాగే చెన్నై నుండి రాత్రి 8గంటలకు బయలుదేరి నంద్యాల కు ఉదయం 6 గంటలకు చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం రాజియా సుల్తానా, డిపో మేనేజర్ గంగాధర్ రావు,ఎపి ఎస్ పీ డిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి,వైసీపీ నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, లక్ష్మీ నారాయణ,కిరణ్ కుమార్,రఫీ,అదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తాగు సాగునీటి సమస్యలు పరిష్కరించండి

**బీజేపీ నేతప్రజా పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి :భూమా కిషోర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేత భూమా కిషోర్ రెడ్డి**



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 22 విభారె న్యూస్ :- ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని తాగునీటి సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బిజెపి ఆళ్లగడ్డ ఇన్చార్జి భూమా కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని స్వగృహంలో గురువారం సాయంకాలం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య నెలకొని ఉన్నా అధికారులు ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పట్టణంలోని సత్రం బజారు, ఎల్ ఎం కాంపౌండ్ తదితర వీధుల్లో ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశాలు ఉందని తెలిసినా, తెలిపినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో బోర్లలో పూడిక పేరుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. పనిచేయని బోర్ల స్థానంలో వేరే బోర్లు ఏర్పాటు చేసే ఆలోచన కూడా వారిలో కనిపించడం లేదన్నారు. నీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. బోర్లలో కూడా రాజకీయం చేస్తున్నారన్నారు. కొంతమంది 300 అడుగులు బోర్ వేయించుకొని 600 అడుగులకు డబ్బులు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు బోర్ వెయ్యాలని కోరితే ఏదో కుంటి సాకులు చెబుతున్నారన్నారు. గ్రామాల్లో కూడా నీటి సమస్య దుర్భరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో నీటి సమస్యను నివారించాలని పేర్కొన్నారు. బిజెపి ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రజాపోరు కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ఈ ప్రజాపోరులో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు వివరిస్తామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నుంచి తమ పార్టీ కూడా ప్రచారాన్ని ప్రారంభిస్తుందన్నారు.

## రవి కిషోర్,సంధ్యల వివాహానికి హాజరైన ఆవోపా సభ్యులు..




విభారె న్యూస్ ఫిబ్రవరి 22 ఎమ్మిగనూరు.ఆవోపా కార్యవర్గ సభ్యుడు వరదా చంద్రశేఖర్, లీలావతి దంపతుల కు మారుడు, రవికిషోర్, సంధ్య ల వివాహ సందర్భంగా ఆవోపా కార్యవర్గ సభ్యులు హాజరై ఆశీర్వదించడం జరిగింది.ఈ శుభ సందర్భంలో వరదా చంద్రశేఖర్ దంపతులు నిరుపేద వృద్ధ, వితంతు మహిళలకు నిత్యావసరాలు అందించే వాసవీ అన్నపూర్ణ సేవా పథకానికి 3,600/ లు విరాళం ప్రకటించారు.వాసవీ మాత అనుగ్రహముతో వీరు నిండు నూరేళ్ళు ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలతో జీవించాలని మనస్పూర్తిగా కోరుకున్నారు.

**టీజీ వెంకటేష్, శ్రీమతి రాజ్యలక్ష్మి లకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘం.**




విభారె న్యూస్ ఫిబ్రవరి 22 ఎమ్మిగనూరు.పూజ్యులు, కుల పెద్దలు ఆర్యవైశ్యుల ఆశాజ్యోతి టీ.జీ.వి సంస్థల చైర్మన్ టి. జి వెంకటేష్ శ్రీమతి రాజ్యలక్ష్మి ల 52వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం తరపున వివాహ శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఇలాంటి మరెన్నో వివాహ వేడుకలు జరుపుకోవాలని మాత అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలాకలిగిఉండాలనిమనసారా కోరుకున్నారు.

## లోక కళ్యాణార్ధం కోసం కంచి కామ కోటి పీఠాధిపతి విజయ యాత్ర



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22-. రాయలసీమ జిల్లాల్లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు పూజ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి విజయ యాత్ర పర్యటన ఖరారు అయినట్లు సమాచారం . నంద్యాల జిల్లా శ్రీశైలం లో 24వ తేది. 25, 26 మహానంది క్షేత్రంలో శ్రీ కామేశ్వరి మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పీఠానికి కావలసిని ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి దగ్గరుండిచేయుచున్నారు. 27 ,28 తేదిలయందు ఆళ్లగడ్డలో. ఫిబ్రవరి 29. మార్చి 2 వతేదిన కడప జిల్లా లో. మార్చి మూడవ తేదీన తిరుపతిలో . విజయ యాత్ర జరగనున్నట్లు సమాచారం. అందుకు కావాల్సిన ఏర్పాట్లను శ్రీశైలం, మహానంది ఆలయ అధికారులు చేపట్టినట్లు తెలుస్తోంది

## పైపులైను సిమెంట్ రోడ్లను తనిఖీలు చేసిన కమిషనర్ నిరంజన్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 22- నంద్యాల పట్టణం లో గురువారం 1-2-8-15- వార్డుల్లో మరియు ఏకలవ్య నగర్ నందు జరుగుతున్న పైపులైను పనులను నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్ల ను తనిఖీలు చేసి వాటి నాణ్యతను పరిశీలించారు. అలాగే శ్రీనివాస నగర్ పంపు హౌస్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఎమ్ ఈఈ రమణ మూర్తి. డీఈలు జయబారత్ రెడ్డి. మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి. ఎఇ హిమబిందు. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది ఉన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190